క్లుప్తంగా

పీహెచ్‌సీలో మందులు అందుబాటులో ఉంచాలి

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానాం పీహెచ్‌సీలో స్థానికంగా వేదాంత చమురు పరిశ్రమ సంస్థ మందులను అందుబాటులో ఉంచాలని ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తాడి గోపాలకృష్ణ మంగళవారం కోరారు. నాలుగు నెలలుగా వేదాంత సంస్థ నియమించిన ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదని, స్థానిక ప్రజలకు పీహెచ్‌సీలో మందులు అందుబాటులో ఉండటంలేదని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

ఘనంగా కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థం


కనకమహాలక్ష్మి అమ్మవారు

అల్లవరం: దేవగుప్తంలో గ్రామ దేవత కనకమహాలక్ష్మి అమ్మవారి వార్షిక మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ యువత ఆధ్వర్యంలో సోమవారం రాత్రి గరగ నృత్యాలతో వైభవంగా జాతర నిర్వహించారు. కొమరగిరిపట్నంలో కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద తీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరగిరిపట్నం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

మాజీ సీఎం జగన్‌పై బుచ్చయ్య వ్యాఖ్యలు తగవు

ఉప్పలగుప్తం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి చేసిన వ్యాఖ్యలు దారుణమని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కుంచే రమణారావు మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. ప్రజాప్రతినిధిగా బాధ్యతతో వ్యవహరించాల్సిన బుచ్చయ్య అభ్యంతరకరంగా వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే అంశమని విమర్శించారు. రాజకీయ విభేదాలుంటే వాటిని హుందాగా వ్యక్తీకరించాలే గానీ వ్యక్తిగతంగా విమర్శించడం సరైన విధానం కాదన్నారు. టీడీపీలో అసంతృప్తిగా ఉన్న వారిలో మొదటి వ్యక్తి బుచ్చయ్యచౌదరికి మంత్రి పదవి రాకపోవడంతో సహనం కోల్పోయి ప్రతిపక్ష నాయకులను విమర్శిస్తున్నారని రమణారావు ఆరోపించారు. టీడీపీ అధిష్టానం దగ్గర మెప్పు కోసం, మంత్రి పదవి కోసం బుచ్చయ్య హింసను ప్రేరేపించేలా మాట్లాడటం మూర్ఖత్వమని, ఇటువంటి వ్యాఖ్యలు సరికాదన్నారు. ప్రజలే దీనిపై తీర్పు చెబుతారని రమణారావు హెచ్చరించారు.

ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులకు సత్కారం


ప్రసాద్, ప్రదీప్‌ను సత్కరిస్తున్న నాయుడు

అమలాపురం టౌన్: ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన ఎమ్మెన్వీ ప్రసాద్, కొర్లపాటి ప్రదీప్‌కుమార్‌ను నేషనల్ టొబాకో డవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేవీఆర్ నాయుడు ఆధ్వర్యంలో పలువురి పట్టణ ప్రముఖులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో మంగళవారం సత్కరించి అభినందించారు. ఏపీ ఐక్య కాపునాడు కన్వీనర్ పబ్బినీడి శ్రీ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కాపు రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్, మున్సిపల్ మాజీ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి తదితర ప్రముఖులు ప్రసాద్, ప్రదీప్‌ను సత్కరించారు. వీరితో పాటు కోనసీమ రైతు సంఘం మాజీ అధ్యక్షుడు సలాది వెంకటానందం, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు, కాపు సంఘాల కో ఆర్డినేటర్ కేవీఆర్ నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కల్వకొలను బాబు, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు గోకరకొండ గంగన్న స్వామి నాయుడు, అప్పన రామకృష్ణ తదితరులు వారిని సత్కరించి అభినందించారు.

ఎస్సీ వాడల్లో సమస్యలు పరిష్కరించాలి

తాళ్లరేవు: పౌర హక్కుల ప్రచారంలో భాగంగా ప్రతి నెలా 30న మండల రెవెన్యూ, పోలీస్ అధికారులు ఎస్సీలు అధికంగా ఉన్న గ్రామాలను సందర్శించి, కుల వివక్షకు సంబంధించిన సమస్యలను తెలుసుకుని పరిష్కరించడంతోపాటు అట్రాసిటీ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కేవీపీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు కేవీపీఎస్ నాయకులు వి.శ్రీనివాసరావు, పి.గోపాలకృష్ణ, డి.అదృష్టదీపుడు, ఎస్.త్రిమూర్తులు తహసీల్దార్ పితాని త్రినాథరావును కలిసి వినతిపత్రం అందజేసారు. దీనిపై తహసీల్దార్ స్పందించి గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ప్రజా సంఘాల నాయకులను కూడా ఆహ్వానించి అట్రాసిటీ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని వివరించారు.

అంగన్‌వాడీలకు యాప్‌లతో యాతన

- ప్రైవేటు భవనాల్లోని కేంద్రాలకు అద్దె బకాయిల పెండింగ్
- యాప్‌ల నిర్వహణకు సాంకేతిక సమస్యలు
- భారీగా పెరిగిన కేంద్రాల నిర్వహణ వ్యయం
- వేతనాలు అంతంత మాత్రం


కోడూరుపాడులో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం


ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

అల్లవరం: గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు పౌష్టికాహారాన్ని, చిన్నారులకు విద్యను అందించే అంగన్‌వాడీ కేంద్రాలను, అందులో పని చేస్తున్న సిబ్బందిని సమస్యలు వెంటాడుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు చాలా చోట్ల శాశ్వత భవనాలు కరువయ్యాయి. ప్రైవేటు భవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తూ అద్దెలు చెల్లించలేక అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. నెలలు తరబడి అద్దె బకాయిలు పేరుకుపోవడంతో వారు తలలు పట్టుకుంటున్నారు. గ్యాస్ బిల్లు పూర్తి స్థాయిలో చెల్లించేలేని స్థితిలో అంగన్‌వాడీ కేంద్రాలను వారు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే కార్యకర్తలు, ఆయాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

తలకు మించిన భారంగా భోజనాల ఖర్చు

అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలకు అందించే భోజనాలకయ్యే ఖర్చు కార్యకర్తలకు అదనపు భారంగా మారింది. కూరగాయల ధరలు ఆకాశాన్నంటడంతో అంగన్‌వాడీ కార్యకర్తలకు చేతి చమురు వదులుతోంది. ఒక ప్రీస్కూల్ విద్యార్థికి కూరగాయల నిమిత్తం 0.75 పైసలు, గ్యాస్ కోసం 0.50 పైసలు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. అయితే నెల రోజులకు కూరగాయల నిమిత్తం రూ.2 వేలు, గ్యాస్ నిమిత్తం రూ. 1,100 కార్యకర్తలు ఖర్చు చేస్తున్నారు. ఒక్కొక్క అంగన్‌వాడీ కేంద్రంలో కనీసం పది మంది పిల్లలు ఉంటే వారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి చెల్లించేంది కేవలం రూ. 3 నుంచి 5 వందలు. మిగిలినదంతా కార్యకర్తల వేతనాల నుంచే ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో కార్యకర్తలకు వచ్చే వేతనం రూ.11,500 కాగా దాని నుంచి ప్రతి నెల రూ.2 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోందని అంగన్‌వాడీలు వాపోతున్నారు.

సాంకేతిక సమస్యలతో పని చేయని యాప్‌లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ రకాల యాప్‌లతో అదనపు పని భారం పెరిగింది. బాల సంజీవిని, పోషణ ట్రాకర్ యాప్‌లో వివరాల నమోదుకు అంగన్‌వాడీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శివారు ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఇంటర్‌నెట్ సమస్య చాలా తీవ్రంగా ఉందని కార్యకర్తలు వాపోతున్నారు. సాంకేతిక సమస్యలతో కార్యకర్తలు నిత్యం ఇబ్బందిపడుతున్నారు. మొబైల్ లేని అంగన్‌వాడీ కార్యకర్తల బాధలు వర్ణనాతీతం. అమలాపురం నియోజకవర్గంలో అల్లవరంలో 75, ఉప్పలగుప్తంలో 75, అమలాపురం రూరల్ పరిధిలో 83 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని కార్యకర్తలు వాపోతున్నారు.

రెండు నెలలుగా అందని వేతనాలు

నిత్యం సమస్యలతో సతమతమవుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏప్రిల్ నుంచి వేతనాలు లేవు. మరో వారం గడిస్తే మూడో నెల ముగుస్తుంది. గడిచిన రెండు నెలలకు వేతనాల ఊసే లేదు. ప్రైవేటు భవనాలకు అద్దె బకాయిలు, గ్యాస్ సిలిండర్, కూరగాయల ఖర్చులు వేలల్లో పేరుకుపోయాయని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు భారీగా పెరిగిపోవడంతో కూరగాయలు, నిత్యావసర సరకులు కొనలేక భోజనాలు పెట్టేందుకు అవస్థలు పడుతున్నాని అంగన్‌వాడీలు వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలకు పనిభారం, అదనపు ఖర్చు భారం తగ్గించకపోతే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మళ్లీ ఉద్యమించేందుకు సిద్ధమని వారు హెచ్చరిస్తున్నారు.

> **ఉన్నతాధికారులకు నివేదిక అందించాం**
>
> అమలాపురం సెక్టార్ పరిధిలోని కార్యకర్తలు, ఆయాల డేటాను పీడీ కార్యాలయానికి పంపించాం. ఒకటి, రెండు రోజుల్లో పెండింగ్ వేతనాలు జమ అవుతాయి. గ్యాస్ సిలిండర్ నిమిత్తం ఒక్కో విద్యార్థికి రూ.50 పైసలు ఇస్తున్నాం. ఈ మొత్తం సరిపోవడం లేదని కార్యకర్తల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకుని పరిష్కరించాలి.
>
> – వై.రమాదేవి, ఐసీడీఎస్ సీడీపీఓ, అమలాపురం

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

ముమ్మిడివరం: పల్లిపాలెం సెంటర్‌లో 216 జాతీయ రహదారిపై సోమవారం రాత్రి మోటారు బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం ఉదయం స్థానిక వీరేంద్ర కూల్‌హౌస్ వద్ద వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ముమ్మిడివరం ఎస్సై జ్వాలా సాగర్ ఘటనా స్థలంలో విచారణ చేశారు. మృతుడి బైక్‌ను జాతీయ రహదారి పక్కన డ్రెయిన్‌లో గుర్తించి పోలీసులు ఆప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజ్ పరిశీలించారు. వేగంగా వచ్చిన బైక్ అదుపు తప్పి ప్రమాదం చోటు చేసుకుందని మృతుడు అమలాపురం మున్నా కాలనీకి చెందిన బీమవరపు బాలయోగి (45)గా గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జ్వాలా సాగర్ తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం

యానాం: నూతన మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన బుద్ధి అఖిల్‌ను మంగళవారం స్థానిక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్, నాయకులు కాటంశెట్టి రామ్మూర్తి, మెల్లం చిన్న, బలగం గణేష్ తదితరులు మర్యాదపూర్వకంగా కలసి ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరధిలో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

సచివాలయ ఉద్యోగులకు న్యాయం చేయాలి


ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

అమలాపురం రూరల్: బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవరించి న్యాయం చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు కోరారు. గ్రామ సచివాలయ ఉద్యోగులకు సొంత మండలాల్లో పనిచేసుకునే అవకాశం కల్పించాలని అమలాపురం మండలంలో ఉద్యోగ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియలో మిగులు సిబ్బందిని ఏం చేస్తారో తెలియజేయాలని కోరారు. ముందుగా పదోన్నతులు కల్పించి, అనంతరం బదిలీలు చేపట్టాలని కోరారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ఇతర ప్రధాన సమస్యలను పరిష్కరించాలని అమలాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం సచివాలయ ఉద్యోగులు నిరసన తెలిపారు. అమలాపురం మండల పరిధిలోని సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు వినతిపత్రం అందించారు.

అభివృద్ధి పనుల జాప్యంపై ఫిర్యాదు


ఎల్జీని సత్కరించిన ఎమ్మెల్యే అశోక్

యానాం: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాషనాథన్‌ను మంగళవారం రాజ్‌నివాస్‌లో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కలిశారు. ఈ సందర్భంగా యానాం నియోజకవర్గం ఎదుర్కొంటున్న పలు సమస్యలు, అభివృద్ధి పనుల ఆలస్యం కావడం తదితర సమస్యలపై ఆయన ఎల్జీకి వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, ఎంపీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసినప్పటికీ అవి పూర్తయ్యేందుకు అధికారులు సహాయసహకారాలు అందించడం లేదని ఎమ్మెల్యే అశోక్ తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఆయా గ్రామాల్లో భూమి పూజలు చేసినా సీసీ రహదారులు, డ్రెయినేజీ పనులు ఆగిపోయాయని ఎల్జీకి వివరించినట్లు ఎమ్మెల్యే అశోక్ తెలిపారు. ఎస్సీ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ఇటీవలి ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ వల్ల ఆయా వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రజావ్యతిరేక నిబంధనలను సడలించాలని కోరినట్టు పేర్కొన్నారు. నూతన మున్సిపల్ కమిషనర్‌ను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఎల్జీ కైలాషనాథన్‌ను ఎమ్మెల్యే అశోక్ సత్కరించారు.

పారిశుధ్య సమస్యల పరిశీలన


అమలాపురం 1వ వార్డులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ నిర్మల్ కుమార్

అమలాపురం టౌన్: పట్టణంలో నెలకొన్న పారిశుధ్య, తాగునీటి సమస్యలను స్థానిక ఒకటో వార్డులో మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తన సిబ్బందితో మంగళవారం ఉదయం స్వయంగా పరిశీలించారు. వార్డు పరధిలోని నల్లవంతెన– ఎర్ర వంతెన వయా హౌసింగ్ బోర్డు కాలనీ మీదుగా ఉన్న బైపాస్ రోడ్డు దుస్థితిని కమిషనర్ గమనించారు. తాగునీరు సక్రమంగా అందని ప్రాంతాలు, పారిశుధ్యం అధ్వానంగా ఉన్న ప్రదేశాలను కమిషనర్ పరిశీలించారు. వార్డు కౌన్సిలర్ సుంకర పార్వతి తనయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర సుధ సమస్యలను కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ స్థానికులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. మున్సిపల్ ఇంజినీర్లు, వార్డు సచివాలయాల కార్యదర్శులు ఉన్నారు.

పదివేల లీటర్ల డీజిల్ స్వాధీనం


అక్రమంగా తరలిస్తున్న డీజిల్‌తో పట్టుబడ్డ నిందితులు, ఆయిల్ ట్యాంకర్

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా డీజిల్‌ను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు యానాం నుంచి ఆయిల్ ట్యాంకర్‌లో పదివేల లీటర్ల డీజిల్‌ను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. దీనికి సంబంధించి అనకాపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు ఆయన తెలిపారు. ఆయిల్ ట్యాంకర్‌ను సీజ్ చేసి పదివేల లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ యానాం నుంచి పెట్రోల్, డీజిల్‌ను తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. ఈ దాడిలో కోరంగి స్టేషన్ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

యానాం: మున్సిపాలిటీ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యతనిస్తున్నట్లు నూతన మున్సిపల్ కమిషనర్, ట్రైనీ ఐఏఎస్ బుద్ధి అఖిల్ పేర్కొన్నారు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వివిధ పనుల కోసం తన కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషి చేస్తానని, రోజుల తరబడి ఆఫీసు వద్దకు వారు తిరిగే పరిస్థితి లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తానన్నారు.

విద్యాభివృద్ధిపై యువత దృష్టి సారించాలి

యానాం: మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలు జీవితాలను నాశనం చేస్తాయని, వాటి జోలికి వెళ్లకుండా విద్యాభివృద్ధిపై యువత దృష్టి సారించాలని ఎస్సై పునీత్‌రాజ్ పేర్కొన్నారు. జూన్ 26 ప్రపంచ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల దుష్పరిణామాలు, వ్యక్తిగత భద్రత, ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. సైబర్ కమాండో డబ్ల్యూపీసీ యడ్ల శాంతి మాట్లాడుతూ సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, ఆర్థిక మోసాలు, సైబర్ రక్షణ తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు, ఎస్‌హెచ్‌ఓ–2 కట్టా సుబ్బరాజు పాల్గొన్నారు.

పలువురు ఐఏఎస్‌లకు శాఖల కేటాయింపు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా పలువురు ఐఏఎస్ అధికారులకు శాఖలను కేటాయించడంతో పాటు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్‌చౌహాన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పు కృష్ణామోహన్‌కు డవలప్‌మెంట్ కమిషనర్ కమ్ సెక్రటరీ, ఫైనాన్స్, రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, రూరల్ డవలప్‌మెంట్, డీఆర్‌డీఏ చైర్మన్‌గా, హయ్యర్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ బాధ్యతలు అప్పగించారు. ముత్తమ్మను ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీ, నోడల్ ఆఫీసర్– ఏడీబీ ప్రాజెక్టును, జయంత్‌కుమార్‌కు సాంఘిక సంక్షేమ, బీసీ, మైనార్టీల సంక్షేమం, పాన్‌కేర్ మేనేజింగ్ డైరెక్టర్, పుదుచ్చేరి కోఆపరేటివ్ సుగర్ మిల్స్, ఏఎస్‌పీఎస్ రవిప్రకాష్‌కు కారైకల్ కలెక్టర్‌గా, ఆర్ స్మితకు కార్మికశాఖ, కార్యదర్శి, కమిషనర్‌గా, పంకజ్‌కుమార్‌కు ఆర్థికశాఖ, స్టాటస్టిక్స్, ఆర్.కేశవన్‌కు ప్రత్యేక కార్యదర్శి, న్యాయశాఖ, మహ్మద్ అషాన్ అబిద్‌కు ఆర్ట్‌అండ్‌కల్చర్, ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిసిటీ, కులోత్తుంగన్‌కు పుదుచ్చేరి జిల్లా కలెక్టర్, హెచ్‌ఆర్‌ఐ కమ్ వక్ఫ్, కమిషనర్ (ఎక్సైజ్)గా నియమించారు.

ఐదుగురు ఐఏఎస్‌ల బదిలీ

యానాం: అయిదుగు ఐఏఎస్ అధికారులకు కేంద్రహోం శాఖ నుంచి బదిలీలు ఉత్తర్వులు రావడంతో మంగళవారం వారిని పుదుచ్చేరి ప్రభుత్వ రిలీవ్ చేసింది. ఎన్నో ఏళ్లపాటు సేవలందించిన విద్యాశాఖ కార్యదర్శి పి ప్రియదర్శిని అరుణాచల్ ప్రదేశ్‌కు, కార్మిక సంక్షేమ కార్యదర్శి వైఎల్ఎన్ రెడ్డి మిజోరాంకు, పారిశ్రామికాభివృద్ధి కార్యదర్శి పీటీ రుద్రగౌడ లడఖ్‌కు, వ్యవసాయ కార్యదర్శి నెడుంజలియన్ న్యూఢిల్లీకి, కారైకల్ కలెక్టర్ సోమశేఖర అప్పారావును లక్షద్వీప్‌కు బదిలీ చేశారు.

ఎస్టీ కమిషన్ విచారణకు హాజరైన ఎస్పీ

అమలాపురం టౌన్: ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి రొద్దా భవాని ఆత్మహత్య కేసులో ఎస్పీ బి.కృష్ణారావు హైదరాబాద్‌లో జాతీయ ఎస్టీ కమిషన్ విచారణ ముందు మంగళవారం హాజరయ్యారు. హైదరాబాద్‌లోని దిల్‌కుష్ గెస్ట్ హౌస్‌లో జాతీయ ఎస్టీ కమిషన్ నిర్వహించిన విచారణలో ఎస్పీ కృష్ణారావు పాల్గొని కమిషనర్ అడిగిన పలు ప్రశ్నలకు బదులిచ్చారు. ఆత్మహత్య చేసుకున్న పంచాయతీ కార్యదర్శి భవానికి సంబంధించిన కేసు వివరాలను తెలిపారు. రొద్దా భవాని భర్త వెంకటేశ్వరరావు, న్యాయపోరాట సమితి కన్వీనర్ బొంతు రమణ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకుడు మొగిలి మల్లయ్యలు కమిషన్ విచారణ ముందు హాజరయ్యారు.

ప్రాంతీయ భాషల్లోనే ఎఫ్ఐఆర్ నమోదు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలో ఆయా ప్రాంతీయ భాషల్లోనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని మంగళవారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ షాలినీసింగ్ ఆదేశాలు జారీ చేశారు. ఆయా రీజినల్ భాషలను గౌరవించాలని అన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఆదేశాలు, ఎల్జీ కె. కైలాషనాథన్ మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. యానాంలో తెలుగులో, పుదుచ్చేరి, కారైకల్ రీజియన్లలో తమిళంలో, మాహే రీజియన్‌లో మళయాళంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు.

బాలికలు, మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రసాద్

అమలాపురం టౌన్: చదువుకునే ఆడపిల్లల రక్షణకు సంబంధించి అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులెదురైనా సమయస్ఫూర్తితో ఎదుర్కొనే విధానాన్ని అలవర్చుకోవాలని జిల్లా ఏఎస్పీ ఏవీఆర్‌బీపీ ప్రసాద్ సూచించారు. స్థానిక విద్యానిధి విద్యా సంస్థల్లో విద్యార్థినులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఏఎస్పీ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. శక్తి యాప్‌ను చదువుకునే ప్రతి విద్యార్థిని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం బాలికలు, మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు న్నాయని తెలిపారు. పోక్సో చట్టం ద్వారా శిక్షలు ఎంత కఠినంగా ఉంటాయో వివరించారు. అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో పట్టణ ఎస్సై టి.శ్రీనివాస్, ఉమెన్ ఎస్సై గంగాభవాని, విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు పాల్గొన్నారు.

నూతన వాహన ఫిట్‌నెస్ విధానాన్ని రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న కోనసీమ రవాణా జేఏసీ సభ్యులు

అమలాపురం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన నూతన వాహనాల బ్రేక్, ఫిట్‌నెస్ పాలసీల వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రాన్స్‌పోర్ట్, లారీ యూనియన్ నాయకులు అన్నారు. పాత పద్ధతిలోనే వెహికల్ స్క్రాపేజ్ పాలసీని కొనసాగించాలని వారు కోరారు. త్వరలో అమలు చేయనున్న నూతన విధానాలను వ్యతిరేకిస్తూ జులై 1న చలో కలెక్టరేట్ ముట్టడించాలని కోనసీమ రవాణా జేఏసీ సమావేశం పిలుపునిచ్చింది. అమలాపురం లారీ యూనియన్ ఆఫీసులో మంగళవారం కోనసీమ జిల్లా రవాణా జేఏసీ సమావేశం నిర్వహించారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు మాట్లాడుతూ వాహనాల ఫిట్‌నెస్ పరిశీలనకు ఎలక్ట్రానిక్ యంత్రాలను వినియోగించాలని నిర్ణయించడం తగదని అన్నారు. కోనసీమ జిల్లాలోని ట్రాన్స్‌పోర్ట్ రంగంలో ఉపాధి పొందుతున్న కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. లారీ యూనియన్ అధ్యక్షుడు నల్లా శ్రీరాములు, కార్యదర్శులు పోలిశెట్టి సీతారాంబాబు, బొంతు బాలరాజు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు గుండుమొగుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మరదలిపై బావ దాడి

అమలాపురం టౌన్: సొంత అక్క భర్త అయిన బావ మరదలితో పాటు ఆమె తల్లిదండ్రులపై దాడి చేశాడు. ఓ సెల్‌ఫోన్ విషయమై ఏర్పడిన వివాదం మంగళవారం దాడికి దారి తీసింది. అమలాపురం రూరల్ మండలం ఆర్‌ఆర్ నగర్‌కు చెందిన వాకా శ్రీదేవి, ఆమె తల్లిదండ్రులపై బావ అయిన పరమట రాజేష్ దాడి చేసి గాయపరిచాడని బాధితులు ఆరోపించారు. బాధితురాలు వాకా శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె బావ రాజేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

డ్రెయిన్లను ఆధునీకరించండి

ఉప్పలగుప్తం: డ్రెయిన్లలో ఉప్పునీరు ఎగదన్నడంతో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని సీఎస్ఆర్ (కామన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో డ్రెయిన్లను ఆధునీకరించాలని ఎస్.యానాం రవ్వ ఆన్‌షోర్ ప్లాంట్ ఏవో సోమన్‌దేవ్‌కు రైతు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎస్.యానాం అడ్మినిస్ట్రేషన్ చాంబర్‌లో మంగళవారం సోమన్‌దేవ్‌ను వారు కలిసి సమస్యలు వివరించారు. ఉప్పునీరు ఎగదన్నకుండా డ్రెయిన్లకు సీఎస్ఆర్ నిధులతో స్లూయిస్ నిర్మించాలని రైతులు వివరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఏవో తెలిపారు. ఉప్పలగుప్తం డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ దంగేటి చిట్టిబాబు, రైతులు అరిగెల నానాజీ, రవణం మధు, మోటూరి రవికుమార్ తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన జున్నూరి నాగలక్ష్మి మంగళవారం రూ.10,116 విరాళం సమర్పించారు. ఈ సొమ్మును దాత ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను అర్చకులు, వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

వంతెన నిర్మాణంపై రైతుల నిరసన

అమలాపురం రూరల్: అవసరం లేని చోట ప్రభుత్వ నిధులతో వంతెన నిర్మాణ చేపట్టారని రైతులు ఆరోపిస్తున్నారు. ఒక కార్యాలయం కోసం ఏకంగా లక్షలు వెచ్చించి వంతెన నిర్మిస్తూ ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని వారన్నారు. అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామ పరిధి రంగాపురం బంగ్లా సమీపంలో వంతెన పనులు జరుగుతున్నాయి రంగాపురం బంగ్లాలో జాయింట్ కలెక్టర్ విశ్రాంతి భవనం, ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం ఉంది. ఈ భవనాల వద్దకు వెళ్లేందుకు ఇటీవల నూతనంగా సిమెంట్ రోడ్డును నిర్మించారు. రంగాపురం కొండదిబ్బకు వెళ్లేందుకు కాలువ పక్క నుంచి మరో సిమెంట్ రోడ్డును నిర్మించారు. ఇప్పుడు మరలా జనావాసాలు లేకున్నా కాలువపై జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో వంతెన నిర్మిస్తున్నారు. ఈ వంతెన నిర్మాణం కోసం కాలువకే అడ్డుకట్ట వేసేశారు. వరి నారుమడులు వేసుకునే సమయంలో కాలువకు అడ్డుకట్ట వేయడంపై రైతులు మండిపడ్డారు. డీసీ రాజులపూడి భీముడు, పాలాటి బాలయోగితోపాటు నాయకులు బ్రిడ్జి వద్దకు చేరు కుని అధికారుల తీరుపై మంగళవారం నిరసన తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ పనులను నిలుపుదల చేయించారు. కాలువకు నీరు ఇవ్వకుంటే రైతులు క్రాఫ్ హాలి డే ప్రకటిస్తారంటూ రైతు నక్కా కృష్ణ అధికారులను హెచ్చరించారు. దీనిపై ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు.